క్లుప్తంగా

విరబూసిన 'మే ఫ్లవర్'



సీతమ్మధారలోని ఓ ఇంట్లో విరబూసిన మే ఫ్లవర్

సీతంపేట: స్థానికంగా ఉన్న ఒక గృహంలో అరుదైన 'మే ఫ్లవర్' వికసించింది. ఎంవీపీ హ్యాపీ హోమ్స్‌లో నివసిస్తున్న వయోజన విద్య మాజీ ఉప సంచాలకుడు పండూరి కూర్మేశ్వర రావు 20 ఏళ్ల కిందట తన బంధువుల ఇంటి నుంచి ఫ్లవర్ దుంపను తెచ్చి గోలెంలో నాటారు. అప్పటి నుంచి ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో విరబూసి అందరినీ ఆకర్షిస్తోంది. హ్యాపీ హోమ్స్‌లో ఉంటున్న మహిళలు ఈ ఫ్లవర్‌ను చూడటానికి వస్తున్నారు. ఈ సందర్భంగా కూర్మేశ్వరరావు మాట్లాడుతూ ఇది మేలో వికసిస్తే సకాలంలో రుతుపవనాలు వచ్చి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని సంకేతమన్నారు. ఆలస్యంగా జూన్‌లో విరబూస్తే రుతుపవనాల రాక ఆలస్యం అవుతుందని, వర్షాలు కూడా ఆలస్యంగా కురుస్తాయని అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

మైనార్టీ హక్కుల రాష్ట్ర కార్యదర్శిగా నారాయణరావు



నారాయణరావు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ హక్కుల కార్యదర్శిగా మద్ర నారాయణరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆయనను నియమిస్తూ నియామక పత్రాన్ని పంపింది. నారాయణరావు మైనార్టీ ప్రజల హక్కుల కోసం చేస్తున్న కృషిని గుర్తించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆయనను ఈ పదవికి ఎంపిక చేసింది. ఈ మేరకు నారాయణరావుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ నియామక పత్రాన్ని పంపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మైనార్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పని చేస్తానని నారాయణరావు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: పోర్ట్ టౌన్ పరిధిలో గల రౌడీషీటర్లకు సీఐ సత్యనారాయణ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి గొడవల్లో తలదూర్చరాదని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వైభవంగా శ్రీకంఠ గురుదత్త ఆలయ వార్షికోత్సవం



గురుదత్త ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలో కొలువైన శ్రీకంఠ గురుదత్త సాయి మందిరం 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. సాయినాథుని పంచామృతాలతో అభిషేకించి.. వెండి తొడుగు, బంగారు కిరీటంతో అలంకరించారు. ఈ సందర్భంగా పండితుల వేదమంత్రాల మధ్య గురుమండలార్చన సహిత దేవీ నవావరుణార్చన పూర్వక పంచ నవరాత్ర హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సతీ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదానం, రాత్రి ప్రసాద వితరణ చేశారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం

- పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి దోహదపడుతున్న ఓపెన్ జిమ్‌లు
- గత ప్రభుత్వ చొరవతో పలు కాలనీల్లో విస్తృతంగా ఏర్పాటు
- పైసా ఖర్చు లేకుండా ప్రజలకు జిమ్‌ల వసతి



చిన్నారులకు కూడా ఉపయోగపడుతున్న జిమ్ పరికరాలు



వాకర్స్ ట్రాక్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్లు



చిన్నారుల కోసం ఆట సామగ్రి

తాటిచెట్లపాలెం: ఆరోగ్యమే మహా భాగ్యం. కానీ ఎందరికి ఈ భాగ్యం కలుగుతుంది. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వారికి ఇది సాధ్యమేనా? నేటి రోజుల్లో ప్రజలకు ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. ఆరోగ్యం కాపాడుకోవాలంటే ఖరీదైన ఆహారం తీసుకోవాలి, లేదా వేలకు వేలు ఖర్చు పెట్టి జిమ్‌ల చుట్టూ, ఫిజికల్ ట్రైనర్ల చుట్టూ తిరగాలి. ఇవి పేద, మధ్య తరగతి ప్రజలకు ఏమాత్రం అందవు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ నిధులతో ప్రతి వార్డులోనూ ఓపెన్ జిమ్‌లు, పార్క్‌లను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా జాతీయ రహదారి పక్కన అధ్వాన్నంగా ఉన్న గ్రీన్‌బెల్టులను ఏ మాత్రం పచ్చదనం కోల్పోకుండా పార్కులుగా, ఓపెన్ జిమ్‌లుగా మార్చారు. నేడు ఎందరో మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువకులు సైతం వీటిని వినియోగించుకుంటున్నారు. గతంలో వాకింగ్ చేయాలంటే పోర్టు స్టేడియం, లేదా జాతీయ రహదారి మీద మాత్రమే చేసేవారు. స్టేడియంలో సాధారణ ప్రజలకు రుసుము వసూలు చేసేవారు. రోడ్డు మీద చేస్తే ప్రమాదకర పరిస్థితి ఎదురవుతుంది. కానీ పరిసర ప్రాంతాల వాసులు ఎక్కడికో దూరంగా వెళ్లాల్సిన అవసరం లేకుండా సమీపంలోనే ఉన్న ఈ ఓపెన్ జిమ్‌లలో వాకింగ్ చేస్తున్నారు. వ్యాయమాలు చేస్తున్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానికులు

అందంగా గ్రీన్‌బెల్ట్‌లు..

గత జీవీఎంసీ హయాంలో అక్కయ్యపాలెం, ముస్లిం తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం, పోర్టు హాస్పిటల్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్టులను సుందరంగా అభివృద్ధి చేశారు. మరికొన్ని చోట్ల పనులు ఇంకా జరుగుతున్నాయి. అందంగా ప్రహరీలు, వాటిలో సుందరమైన పెయింటింగ్, పార్క్ లోపల పచ్చని మొక్కలు, వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల కోసం పలు ఆట పరికరాలు, పెద్దల కోసం వ్యాయామ పరికరాలు సమకూర్చారు. వీటితో పాటు కొన్ని చోట్ల బ్యాడ్మింటన్ కోర్టులు, సేదదీరేందుకు అందమైన బెంచీలు, రాత్రి వేళల్లో కనువిందు చేసే అత్యాధునిక లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడూ పిచ్చి మొక్కలు, తుప్పలతో నిండి ఉండే గ్రీన్‌బెల్టులకు సుందరమైన శోభ వచ్చింది. కానీ వీటిని నిర్వహించడం మాత్రం కొంచెం కష్టమనే చెప్పాలి. ఇక్కడ ఏర్పాటు చేసిన కొన్ని లైట్లు, విలువైన వస్తువులు, చివరకు అందమైన పూల మొక్కలు సైతం దొంగల పాలయ్యాయి. దీంతో వీటిని వినియోగిస్తున్న వారు సైతం అధికారులు దృష్టి పెట్టాలని, అనవరమైన చోట సీసీ టీవీలు ఏర్పాటు చేస్తే ప్రజల సొమ్ము చోరీకి గురి కాకుండా కాపాడవచ్చని కోరుతున్నారు. ముఖ్యంగా అక్కయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో గల పార్కులను వెంకటపతిరాజు ప్రత్యేక శ్రద్ధతో, సొంత నిధులతో సంరక్షిస్తున్నట్లు ఇక్కడి వాకర్లు తెలియజేస్తున్నారు. కానీ ఎంత చేసినా ఏదో సమయంలో ఏదో విధంగా కొన్ని వస్తువులు మాయమైపోతున్నట్లు వీరు తెలిపారు.



సాయంత్రం వేళ సేదదీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

గత ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది..



గత ప్రభుత్వం ఈ పార్క్‌లను అభివృద్ధి చేసింది. వాకింగ్ కోసం, చిన్న చిన్న జిమ్ పరికరాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా మాకు దగ్గర్లోనే వీటిని ఏర్పాటు చేయడం చాలా సంతోషం. ఈ పార్క్ నిర్వహణ ఇలా ఉందంటే వెంకటపతిరాజే కారణం. ప్రతి విషయాన్ని ఈయన గమనించి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సరి చేయిస్తుంటారు. జిమ్ పరికరాలు కొన్ని సరైన ఆయిలింగ్, గ్రీజ్ పెట్టకపోవడం వల్ల పాడైపోతున్నాయి. అధికారులు సరైన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టాలి.

– ఎం. జానీ, అక్కయ్యపాలెం

ఎంతో ఉపయోగపడుతున్నాయి..



మేము పల్లవి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాం. గత కొంత కాలంగా ఇక్కడే వాకింగ్ చేస్తున్నాను. గతంలో వాకింగ్ కోసం చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇది మాకు దగ్గర్లోనే ఉండడంతో క్రమం తప్పకుండా ఇక్కడ వ్యాయామం, వాకింగ్ చేస్తున్నాను. ఇటువంటి పార్కులను ఏర్పాటు చేసి గత ప్రభుత్వం చాలా మంచి పని చేసింది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇవి నేడు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వీటి నిర్వహణ కూడా క్రమం తప్పకుండా చేపట్టాలి.

– పి. శంకర్రావు, అక్కయ్యపాలెం

ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి..



ప్రకృతిని ఆస్వాదించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం నాకు ఇష్టం. దీనిలో భాగంగా నేను ఈ పార్క్‌లు, ఓపెన్ జిమ్, ఆట స్థలాలను పరిరక్షిస్తున్నాను. జీవీఎంసీ, హార్టికల్చర్ విభాగం వారు ఏర్పాటు చేసిన మొక్కలతో పాటు ఈ ప్రాంతాల్లో నేను సొంతంగా అందమైన, ఖరీదైన, ఔషధ గుణాలతో కూడిన మొక్కలను అందమైన కుండీలలో వేయించాను. కానీ కొన్ని మాయమైపోయాయి. ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి. అధికారుల సహకారంతో అవసరమైన హార్టికల్చర్, శానిటేషన్ పనులు సక్రమంగా చేయించుకోగలగుతున్నాము. అవసరమైన ఆయిలింగ్, గ్రీజింగ్, పెయింటింగ్, మరమ్మతులు చేపట్టి పది కాలాల పాటు వీటిని కాపాడాలి.

– **వెంకటపతిరాజు**, అబిద్‌నగర్ నివాసితుల సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఇన్సూరెన్స్ అధికారి

కులగణనతోనే బీసీలకు న్యాయం



కట్టా మల్లేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న పూర్ణచంద్రరావు

సీతంపేట: కులగణనతోనే బీసీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు, ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం బీసీ సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్టా మల్లేశ్వరరావును బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించి నియామక పత్రం అందజేసి సత్కరించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జనాభాలో 60 శాతం బీసీ కులాలు ఉన్నప్పటికీ రాజకీయ, విద్య, ఉద్యోగాలలో తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. కులగణన జరిగితే జనాభా దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ పార్టీలకు అతీతంగా బీసీ సమస్యలపై పోరాటం చేస్తూ అన్ని కుల, ప్రజా సంఘాలను కలుపుకుని సమగ్ర కులగణన సాధించుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి, పోరాటం చేసిన అన్ని సంఘాలకు అభినందనలు తెలిపారు. కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధన ఎత్తివేయాలన్నారు. అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కేటాయించడం వల్ల జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు నష్టపోతున్నారని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై పునఃసమీక్ష చేయాలని కోరారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలుకు బీసీ సమన్వయ కమిటీ పోరాటం చేస్తుందన్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడంరెడ్డి బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, రాష్ట్ర కోశాధికారి పొట్లూరి దేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లు రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగుల ఆంజనేయులు, పోచా రమేష్, ఓర్సు భాస్కర్, ఎర్రగుంట్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార నియమాలతో ఆరోగ్యం పదిలం



మహిళలను సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మంచి ఆరోగ్య నియమాలు పాటించి, కొంతసేపు వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ అన్నారు. మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఈస్ట్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. గుండెకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎముకల నిపుణులు డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ మన శరీరం సహకరించినంత వరకే వ్యాయామం చేయాలన్నారు. అతి వ్యాయామం మంచిది కాదన్నారు. ఈ సందర్భంగా ఎముకల సాంద్రత, బీపీ, షుగర్, బీఎండీ తదితర పరీక్షలు చేశారు. మాతృదినోత్సవం నిర్వహించి ముగ్గురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, పార్క్ అధ్యక్షుడు బి.మురళీకృష్ణ, కార్యదర్శి ప్రసాద్, క్లబ్ అధ్యక్ష , కార్యదర్శులు కె.మాధవి, పి.కమల, కోశాధికారి ఎం.శేషామణి, బులెటిన్ ఎడిటర్ డి.శిరీష, జాలివాకర్ సుగుణ, హెల్త్ వాకర్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాసరాజు, కేర్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ సురేష్ పాల్గొని, శిబిరం నిర్వహణకు సహకరించారు.

గురక సమస్య నివారణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

మహారాణిపేట: వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే గురక వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు, అంకోశా అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్‌ఈ అప్పారావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసా హాల్లో శృశ్రిత ఈఎన్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన నిరంతర వైద్య విద్యా (సీఎంఈ) కార్యక్రమంలో పలువురు నిష్ణాతులైన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు నూతన వైద్య విధానాలకు సంబంధించి వైద్యులు, వైద్య విద్యార్థులకు ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ కిషోర్, నంద్యాలకు చెందిన డాక్టర్ మధుసూదనరావు గురక నివారణ, కాక్లియర్ ఇంప్లాంట్‌సర్జరీపై మాట్లాడారు. అధిక బరువు, ఊబకాయం, సైనసైటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిలో గురక అధికంగా ఉంటుందన్నారు. ఆక్సిజన్ లెవల్ తగ్గడంతో మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. షుగర్, బీపీ, గుండెపోటు వంటి జబ్బులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. సకాలంలో వైద్య సలహాలు తీసుకోకపోతే ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 400 మంది వరకూ వైద్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ పూర్వ కమిషనర్ వై.వి. అనురాధ, డాక్టర్ చిట్టి పంతులు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సరోజిని, అంకోశా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ వెలంగిణిరావు, డాక్టర్ కావ్య, రాఘువేంద్రరావు, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సుశ్రిత తదితరులు పాల్గొన్నారు.

కథారచనపై అవగాహన



కథా రచన చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథారచనపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి కేవీ రామారెడ్డి పాల్గొని, విద్యార్థులకు కథలు చదివి వినిపించారు. విద్యార్థులు తాము విన్న కథలను కాగితంపై రాశారు. ఈ సందర్భంగా మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. తల్లి గొప్పదనాన్ని లైబ్రేరియన్ పద్మజ వివరించారు. తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు.

అలరించిన హాస్య వల్లరి



అవార్డు గ్రహీతలు నాంచారయ్య, నాయుడులను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన హాస్యవల్లరి ప్రేక్షకులను అలరించింది. క్లబ్ అధ్యక్షుడు రావి గోపీకృష్ణ ఆధ్వర్యంలో క్లబ్ కళాకారులు కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే కందుకూరి అవార్డులు అందుకున్న వఠ్రే నాంచారయ్య, పి.సి.హెచ్.నాయుడులను సత్కరించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కని స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంచరపాలెం: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్ వాకర్స్ క్లబ్, శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ద్వారకానాథ్ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జయతి ఉమా మహేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ పర్యవేక్షణలో వాకర్స్ క్లబ్ కుటుంబ సభ్యులు, స్థానికులు నేత్ర శిబిరాన్ని వినియోగించుకున్నట్లు కార్యదర్శి కాళ్ల వెంకట ప్రసాద్ తెలిపారు. సుమారు 232 మందికి ఉచిత సంపూర్ణ నేత్ర పరీక్షలు చేసి మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఉపాధ్యక్షుడు జె.రమేష్‌కుమార్, కోశాధికారి సోండి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్, జాలీ వాకర్ ఏఎల్ నరసింహారావు, వైద్య సిబ్బంది, బోర్డు కో-ఆర్డినేషన్ సభ్యులు, క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ జయంతి



లలితాపీఠంలో లక్ష్మీ నరసింహస్వామి

సీతంపేట: నృసింహ జయంతి సందర్భంగా అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో ధన్వంతరి సహిత శ్రీసుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



లలితాపీఠంలో ధన్వంతరి సహిత సుదర్శన హోమం

సీతమ్మధార కృష్ణ మందిరంలో..

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలో గల కృష్ణ మందిరంలో ఆదివారం నరసింహ యజ్ఞం ఘనంగా ముగిసింది. వేద మంత్రాలతో ఈ వేదపండితులు ఈ యజ్ఞం నిర్వహించారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రపంచ శాంతి అని నిర్వాహకులు తెలిపారు. హరేకృష్ణ మూమెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్తదాస నరసింహ అవతారం గురించి భక్తులకు వివరించారు. సాయంత్రం 6 నుండి 6.30 వరకు నరసింహ యజ్ఞం, అనంతరం పూర్ణాహుతి, శాంతి వచనం, నరసింహ లీలావచనం, మంగళహారతి, సంకీర్తన నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.



పాల్గొన్న భక్తులు



కృష్ణ మందిరంలో యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

అథ్లెట్‌కు ఆర్థిక సాయం



సరోజినిని సత్కరించి, సాయం అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్ పాల్గొని, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రాణిస్తున్న దువ్వూరి సరోజినిని సత్కరించి, క్లబ్ తరపున రూ.9వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీలంకలో నిర్వహించనున్న అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనేందుకు తమవంతుగా ఈ సాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి చెప్పారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ పూర్వ అధ్యక్షురాలు ప్రభాశర్మ, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి ఎం.భానుమతి, జాలీవాకర్ ఎ.లీలావతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీష లత, సంయుక్త కోశాధికారి ఎం.ప్రమీల రావు, బులిటెన్ ఎడిటర్ సీహెచ్.పద్మావతి పాల్గొన్నారు.